క్లుప్తంగా

నేడు ఆత్మగౌరవ సభ

కొడంగల్: నాగర్‌కర్నూల్ నియోజకవర్గం బిజినేపల్లి మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు దళిత గిరిజన ఆత్మగౌరవ సభ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. కొడంగల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ, గ్రామ కమిటీ, మండల కమిటీ బాధ్యులు హాజరుకావాలని పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్, మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్ కోరారు. కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రానున్నట్లు తెలిపారు. రేవంత్ అభిమానులు పెద్ద సంఖ్యలో వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కేజ్‌వీల్స్‌తో బీటీలపై దూసుకెళ్తున్న ట్రాక్టర్లు



ఇనుప చక్రాలతో రోడ్డుపై ట్రాక్టర్..

బొంరాస్‌పేట: సాగుపనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో కేజ్‌వీల్స్ ట్రాక్టర్ల సహాయంతో రైతులు తమ సాగు భూములను చదును చేసి, కరిగెట పొలాలుగా మార్చేందుకు సిద్ధమయ్యారు. అందులో భాగంగా గ్రామాల్లో బీటీరోడ్లపై ఇనుప చక్రాలతో ట్రాక్టర్లు ఎక్కువగా తిరుగుతుండడంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయని పలువురు వాపోతున్నారు. ఇలా కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు రోడ్లపై తిరిగితే రోడ్లు పాడైపోవా అంటూ.. బీటీపై వాటిని తిరగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

గెలుపోటములు సహజం



క్రీడాకారులతో ఎస్‌ఐ రమేష్‌కుమార్

దౌల్తాబాద్: క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, నిరుత్సాహపడకుండా పట్టుసాధించాలని ఎస్‌ఐ రమేష్‌కుమార్ క్రీడాకారులకు సూచించారు. శనివారం మండలంలోని సురాయిపల్లి గ్రామంలో బంగారమ్మతల్లి జాతర సందర్భంగా కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎస్‌ఐ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసాన్ని అందిస్తాయన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తల సమావేశం నేడు

యాలాల: బీజేపీ మండల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు కుర్వ మహిపాల్ తెలిపారు. బాగాయిపల్లి చౌరస్తాలో నేడు మధ్యాహ్నం 12 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, కార్యక్రమానికి చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీ కృష్ణగౌడ్, రమేష్‌కుమార్ హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. సమావేశానికి కార్యకర్తలు, నాయకులు భారీగా తరలిరావాలని మహిపాల్ కోరారు.

కంటి చూపును కాపాడుకోండి



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

బంట్వారం: ప్రతి ఒక్కరు తప్పని సరిగా కంటి పరీక్షలు చేయించుకొని, చూపును కాపాడుకోవాలని నాగవరం సర్పంచ్ లక్ష్మి సూచించారు. శనివారం మండల పరిధిలోని నాగవరంలో ఆమె కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. 18 ఏళ్లు పైబడిన వారందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మానస, క్యాంపు ఇన్‌చార్జి డాక్టర్ అక్షయ్, సూపర్‌వైజర్ త్రివర్ణ, ఎంపీహెచ్ఓ ఐలయ్య, ఆప్తమాలజిస్టు నవీన్, స్థానిక ఎఎన్ఎం అమృత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రేపు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

పెద్దేముల్: ఈ నెల 23న పెద్దేముల్ మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మధ్యాహ్నం 3గంటలకు చెక్కుల పంపిణీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై, లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తారని చెప్పారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వాసన భరించలేం..
ఊరిడిసిపోతం

- కలుషితమైన తాగునీరు
- దుర్వాసనతో నిద్రకు దూరమయ్యాం
- రోగాల బారిన పడుతున్నాం
- ఫ్యాక్టరీని మూసివేయాలంటూ గ్రామస్తుల ఆందోళన

తాండూరు రూరల్: 'జిప్సం కర్మాగారం నుంచి వచ్చే దుర్వాసన భరించలేక పోతున్నం. ఊరిడిసి వెళ్లిపోతం' అంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మండల పరిధిలోని గుంతబాసుపల్లి సర్పంచు జగదీష్ సమక్షంలో స్థానికులు భారీగా గ్రామశివారులో ఉన్న 'ఇండస్ చెమ్' కెమికల్ ఫ్యాక్టరీ ఎదుట బైటాయించి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. రెండు సంవత్సరాల క్రితం ఇండస్ చెమ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేశారని, ఈ ఫ్యాక్టరీ ఎదుట మరో జిప్సం ఫ్యాక్టరీ ఉందన్నారు. ఈ రెండు కంపెనీల నుంచి కెమికల్ దుర్వాసన వస్తోందని, ప్రతిరోజు సాయంత్రం అయిందంటే చాలు ఆ దుర్వాసన భరించలేక పోతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేశారు. జిప్సం ఫ్యాక్టరీ ముడి సరుకుల ద్వారా వస్తున్న వాసనతో ఊపిరి ఆడటం లేదని, వాసనతో రాత్రుళ్లు నిద్రపట్టడం లేదని వాపోయారు. పొలాల్లో బోర్లు వేస్తే.. కలుషితమైన నీరు వస్తోందని, తాగేనీరు కలుషితమై.. చిన్నారులకు అనారోగ్య సమస్యలు తలెత్తున్నాయన్నారు. కావున ఆ సంస్థలను వెంటనే మూసి వేయాలని డిమాండ్ చేశారు.



కెమికల్ ఫ్యాక్టరీ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

ఫిర్యాదు చేయండి..



యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎస్సై

ఫిర్యాదు చేయండి.. కేసు నమోదు చేస్తామని కరన్‌కోట్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి గ్రామస్తులకు సూచించారు. ఫ్యాక్టరీ ఎదుట ప్రజలు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న ఎస్‌ఐ.. ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళనకారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కర్మాగారం యాజమాన్యంతో ఎస్‌ఐ ఫోన్‌లో మాట్లాడారు. దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గ్రామస్తులతో కలిసి ఫ్యాక్టరీ లోపలికి వెళ్లి పరిశీలించారు.

ఊళ్లోంచి వెళ్లిపోతం



మా ఊరు చుట్టూర్ల కెమికల్ కంపెనీలు ఉన్నయ్. రోజు ఫ్యాక్టరీల నుంచి వచ్చే వాసనతో ఊర్లో ఉండలేకపోతున్నం. ఫ్యాక్టరీ మూసెయ్యాలి. లేదంటే గ్రామస్తులందరం ఊరిడిసి పోతం. తాగే నీళ్ల మొత్తం పాడైపాయినయ్. పిల్లలకు రోగాలు వస్తున్నయ్. కంపెనీని మూసెయ్యాలి. - పెంటమ్మ, గుంతబాసుపల్లి గ్రామం

బెదిరిస్తున్నారు..



జిప్సం ఫ్యాక్టరీ వలన దుర్వాసన వస్తోందని.. గ్రామంలో ఉండలేక పోతున్నామని ఫ్యాక్టరీ యాజమాన్యానికి చెబితే నన్ను బెదిరిస్తున్నారు. మా ప్రాణాలు పోతున్నాయని చెప్పినా కనికరించడంలేదు. శాంతి యుతంగా ఆందోళన చేస్తున్నాం. ఒకవేళ ఫ్యాక్టరీ మూసి వేయకపోతే.. ఆందోళన ఉధృతం చేస్తాం. పోలీసులు, రెవెన్యూ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేస్తాం. పదవి ముఖ్యం కాదు. గ్రామస్తుల ప్రాణం ముఖ్యం. - జగదీష్, సర్పంచు, గుంతబాసుపల్లి

గ్రామాల అభివృద్ధికి కృషి

- పల్లెప్రగతితో పెరిగిన స్వచ్ఛత
- తగ్గుముఖం పట్టిన విషజ్వరాలు
- మీతో–నేనులో ఎమ్మెల్యే ఆనంద్

మోమిన్‌పేట: పక్కా ప్రణాళికతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ చెప్పారు. శనివారం టేకులపల్లిలో చేపట్టిన మీతో–నేను కార్యక్రమంలో ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జీపీ వద్ద ఏర్పాటు చేసిన గ్రామ సభలో మాట్లాడారు. నాన్ కమ్యూనికెబుల్ డీసిస్(ఎన్‌సిడీ) బీపి, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి, వారికి తగిన మాత్రలు పంపిణీ చేయాలని వైద్య సిబ్బందిని ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామంలో రెండో విడత కంటివెలుగు ఫిబ్రవరి 23 నుంచి నిర్వహించబడుతుందని, ప్రతి ఒక్కరు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. పల్లెప్రగతి ద్వారా గ్రామాలు స్వచ్ఛతను చాటుకున్నాయని, తద్వారా మలేరియా, డెంగీ వ్యాధులు తగ్గాయని, అలాగే మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయడం వలన టైఫాయిడ్ వ్యాధులు అదుపులో ఉన్నాయని ఆయన వెల్లడించారు. ప్రతి శుక్రవారం గ్రామ పంచాయతీ వద్ద పశువైద్యాధికారి అందుబాటులో ఉంటారని, రైతులు తమ పశువులకు చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచు నవనీత, ఉప సర్పంచు రైయిస్, ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, పీఆర్ ఏఈఈ ప్రణీత్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హరిశంకర్, మండల అధికారులు, నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



టేకులపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

దౌల్తాబాద్: పార్టీ బలోపేతానికి పాటుపడుతూ.. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగిరేలా చూడాలని ఆ పార్టీ పార్లమెంటరీ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో భాజపా శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి బీఆర్‌ఎస్ అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని, ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేసి కొడంగల్‌లో కమలం జెండా ఎగరడానికి కృషి చేయాలన్నారు. అందుకు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని సూచించారు. అలాగే కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ నర్సింహులు, మండల అధ్యక్షుడు సతీష్ తదితరులున్నారు.

అందరికోసం పరితపించిన ఉత్తమురాలు

- మత రహిత సమాజం కోసం పాటుపడిన ఉపాధ్యాయురాలు
- ఫాతిమా షేక్ జయంతిలో న్యాయవాది గోపాల్

తాండూరు టౌన్: కుల, మత రహిత సమాజం కోసం, అన్ని వర్గాల వారు విజ్ఞానం పొందాలనే ఉద్దేశంతో విద్యను బోధించిన తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ అని మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది గోపాల్ కొనియాడారు. భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన ఫాతిమా జయంతి వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ముగింపు వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న న్యాయవాది గోపాల్ మాట్లాడారు. బాలికా విద్య, అణగారిన వర్గాల ప్రజలు, పేదరికంలో మగ్గుతున్న వారికి విద్యను అందించిన మహనీయురాలని, ఆమెను ఆదర్శంగా తీసుకుంటూ.. ఆమె అడుగుజాడల్లో విద్యార్థులు నడవాలని సూచించారు. ఉర్దూఘర్ చైర్మన్ అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ మైనార్టీ విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అనేక గురుకులాలను ఏర్పాటు చేసిందని, విదేశాల్లో చదువుకోవాలనే విద్యార్థులకు అండగా నిలుస్తుందన్నారు. బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం తాండూరు ఇన్‌చార్జి జిలాని మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని మైనార్టీల కోసం ప్రభుత్వం గురుకులాలను నెలకొల్పిందన్నారు. అనంతరం వారం రోజుల పాటు విద్యా సంస్థల్లోని విద్యార్థులకు నిర్వహించిన పలు రకాల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మహబూబ్ ఫాతిమా, న్యాయవాదులు శ్రీనివాస్, కలాం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది గోపాల్

చదివితేనే సమాజంలో గుర్తింపు

- డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి



సోమన్‌గుర్తిలో స్టడీ మెటీరియల్స్ అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్, సర్పంచ్

పూడూరు: ప్రతి విద్యార్థి పోటీతత్వాన్ని అలవర్చుకుని చదువులో రాణించాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి సూచించారు. శనివారం మండల పరిధిలోని మన్నెగుడ, పూడూరు, సోమన్‌గుర్తి, మంచన్‌పల్లి గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివే పదో తరగతి విద్యార్థులకు బీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్స్ అందజేసి మాట్లాడారు. ఉన్నత చదువులు చదివితేనే సమాజంలో గౌరవంతో పాటు బంగారు భవిష్యత్తు ఉంటుందని, క్రమశిక్షణతో చదివి పదిలో ఉన్నత ర్యాంకులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సంధ్య, నవ్య, మాజీ సర్పంచ్ గోపాల్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, డైరెక్టర్ శ్రీశైలంగౌడ్, ఎస్ఎంసీ చైర్మన్‌లు తాజోద్దీన్, జంగయ్య, వెంకటేష్, దత్తాత్రేయ, సతీష్, వీరయ్య, మధు, నాయకులు భాస్కర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, అజయ్, సిరాజ్, శివకుమార్ పాల్గొన్నారు.

రైతు సమస్యలు పట్టని అధికారులు

కుల్కచర్ల: రైతు సమస్యలను ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని కుల్కచర్ల ఎంపీటీసీ ఆనందం ఆరోపించారు. శనివారం మండల పరిధిలోని కామునిపల్లి గ్రామంలో కామునిచెరువు తూమును పరిశీలించి, తాత్కాలికంగా పొలాలకు నీరందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువు మరమ్మతుల పేరిట అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇష్టారీతిన పనులు చేయించడంతో.. ప్రస్తుతం పొలాలకు నీరందని దుస్థితి నెలకొందని విమర్శించారు. ఇప్పటికైనా ఇరిగేషన్ జిల్లా అధికారులు స్పందించి, రైతులకు నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు.



తూమును పరిశీలిస్తున్న ఎంపీటీసీ ఆనందం

ఎస్టీయూ అభ్యర్థిని గెలిపించాలి



ప్రచారం చేస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతగిరి: ప్రశ్నించే గొంతుకను శాసనమండలికి పంపిద్దామని ఎస్టీయూ వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం వికారాబాద్ మండలంలోని గొట్టిముక్ల, మద్గుల్ చిట్టంపల్లి, వెంకటపూర్ తండా, శివారెడ్డిపేట, వికారాబాద్‌లోని బాలుర, బాలికల పాఠశాల, ఆలంపల్లి, కొత్తగడి పాఠశాలల్లో ఎస్టీయూ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి భుజంగరావు గెలుపునకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల సాధనకు నిరంతరం కృషి చేసి, శాసనమండలిలో తన గొంతును వినిపించే భుజంగరావును గెలిపించాలని కోరారు. విద్యా వ్యవస్థలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, పారదర్శక బదిలీలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ పూర్వ అధ్యక్షుడు బసిరెడ్డి, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఔషధాలున్నా.. ప్రోత్సాహం సున్నా

- పెరుగుతున్న కుసుమ సాగు
- అవగాహన కల్పిస్తే.. పెరగనున్న డిమాండ్: రైతులు

మోమిన్‌పేట: నిత్యం తినే ఆహారంలో కూరగాయలది ప్రథమస్థానం. అందులో వంట నూనె లేనిదే ఆ కూరకు రుచిశుచి ఉండదు. అందులో అన్ని నూనెల కన్నా.. శ్రేష్ఠమైనది తెల్ల కుసుమల నూనె. ఈ నూనెతో వండిన ప్రతి వంటకు రుచి ఎక్కువగా ఉంటుందని ఆ ఆయిల్‌ను వినియోగిస్తున్నవారి అభిప్రాయం. గతంలో రైతులు తప్పని సరిగా వంట నూనె కొరకు కుసుమను సాగు చేసేవారు. ప్రస్తుతం మార్కెట్లో తెల్ల కుసుమల నూనె లీటర్ ధర రూ.400 పైనే ఉంది. రానురాను కుసుమ సాగు చేసేవారు కరువయ్యారు. ఈ మధ్యనే రెండుమూడేళ్లుగా సాగు స్వల్పంగా పెరుగుతూ వస్తోంది. కూలీల కొరత, వాణిజ్య పంటలపై రైతులు ఆసక్తితో కుసుమను సాగు చేసేవారిని వేళ్లపై లెక్కించవచ్చు. మండలంలో 150 ఎకరాలకు మించి సాగు చేయడం లేదు. తాండురులోని వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు కుసుమ పూరేకులలో ఎన్నో ఔషధ గుణాలున్నాయని కనుగొన్నారు.

ప్రోత్సాహం కరువు

కుసుమ పూరేకులలో ఔషధ గుణాలుండటం, శ్రేష్ఠమైన వంట నూనె లభించడం లాంటి పంట సాగుకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేదని రైతులు వాపోతున్నారు. రబీ(యాసంగి)లో పండించే కుసుమకు విత్తనం, ఎరువులకు రాయితీలు కల్పిస్తూ మద్దతు ధరను ప్రకటిస్తే సాగు పెరుగుతుందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు. ఔషధ గుణాలపై అవగాహన కల్పిస్తే.. మరింత మంది రైతులు సాగుకు మొగ్గుచూపే అవకాశం ఉందని పలువురు కర్షకులు కోరుతున్నారు.



మోమిన్‌పేట: మొరంగపల్లిలో కుసుమ పంట

ఔషధ గుణాలు పుష్కలం

కుసుమ పూరేకులలో ఔషధ గుణాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తే వినియోగం పెరిగి, మార్కెట్లో డిమాండ్ ఏర్పడనుంది. పూరేకులతో చేసిన డికాక్షన్ లేదా టి(తేయాకు బదులుగా) సేవించడం వల్ల.. 1.రక్తపోటు అదుపులో ఉంటుంది. 2.రక్తంలో కొలస్ట్రాల్ తగ్గుతుంది. 3. కీళ్లనొప్పులు, మెడ నొప్పులను తగ్గిస్తుంది. 4. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాలను వ్యాకోచింప చేయడం ద్వారా రక్తపోటును తగ్గిస్తుందని పరిశోధనలో తేలింది. కుసుమలో పూర్తిగా పూత విచ్చుకున్న దగ్గర్నుంచి 15–20రోజుల తర్వాత వడలి పోయిన పూరేకులను కోయడం వలన అధిక పూత దిగుబడి రాబట్టవచ్చు. మరీ ఆలస్యం అయితే పూతలో తేమ శాతం తగ్గి.. కోసేటప్పుడు పొడిగా మారి కింద రాలిపోతుంది.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

ధారూరు: మండల పరిధిలోని కుక్కింద ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం దాతలు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. వికారాబాద్ పట్టణానికి చెందిన దాతలు బాలరాజ్, సుదర్శన్‌లతో కలిసి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి వీటిని అందజేశారు. అనంతరం దాతలను హెచ్ఎం, ఉపాధ్యాయులు సన్మానించారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

తాండూరు టౌన్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్ నాయక్ అన్నారు. శనివారం ఆదర్శనగర్ కట్టమైసమ్మ ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో టీడీపీ తాండూరు ఇన్‌చార్జి, మాజీ కౌన్సిలర్ సూరజ్ సింగ్ ఠాకూర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దైవ చింతనను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని, కట్టమైసమ్మ ఆలయ పునర్నిర్మాణానికి రూ.25 లక్షల వరకు ఖర్చు కానుందని, అభివృద్ధికి తమవంతు ఆర్థికసాయం చేస్తామని హామీ ఇచ్చారు. దాతలు విరాళాలు అందజేసి ఆలయ నిర్మాణంలో పాలుపంచుకోవాలన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి సుధాకర్, మాజీ కౌన్సిలర్ రమేష్, దిలీప్ సింగ్, నర్సింహులు, ప్రకాష్, భాను పవార్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

'బ్యాంకు మేనేజర్‌ను సస్పెండ్ చేయాలి'

బొంరాస్‌పేట: రైతుబంధు ద్వారా ప్రభుత్వం రైతులకు ఆర్థికసాయం బ్యాంకు ఖాతాల్లో వేస్తున్నా.. బ్యాంకు అధికారులు ఆ డబ్బులను ఇవ్వకుండా వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రజాసంఘాల నాయకులు ఆరోపించారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొత్తూరు చంద్రయ్య, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉప్పలి మల్కయ్య మాట్లాడుతూ ఎస్‌బీఐ మేనేజర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అందజేస్తున్న పంటపెట్టుబడి సాయం.. రైతులకు ఇవ్వకుండా వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ప్రస్తుతం రైతుబంధు ఖాతాల ద్వారా లావాదేవీలు జరపకుండా నిలిపివేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మండల కేంద్రంలోని ఎస్‌బీఐ మేనేజర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

కుల్కచర్ల: దేశ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని సాల్వీడ్ గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయంలో పని చేస్తున్న పూజారులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత హిందువులైన ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రపంచ దేశాలకు మంచి, చెడులను సూచించిన సనాతన ధర్మ శాస్త్రం గల దేశం భారతదేశమని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మహిపాల్ ముదిరాజ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు గడుసు మహిపాల్, బీజేపీ నేతలు అంజిలయ్య, నర్సింహులు, శ్రీనివాస్ శ్రీశైలం, అశోక్, కేశవులు, నరేశ్, భరత్, బాలకృష్ణ, రామకృష్ణ, ఆంజనేయులు, కృష్ణ, నర్సింహులు, మల్లేశ్, రవి పాల్గొన్నారు.



పూజారిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

పార్టీకి పూర్వవైభవం తెస్తాం

కాంగ్రెస్ పార్టీ బ్లాక్–2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి

మర్పల్లి: మర్పల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకు వస్తామని ఆ పార్టీ బ్లాక్–2 అధ్యక్షుడు మల్కనెల్లి కృష్ణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పక్షం రోజులుగా మండలంలో నిర్వహిస్తున్న పల్లెపల్లెకూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో భాగంగా శనివారం బూచన్‌పల్లి, మర్పల్లిలో ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పల్లెపల్లెకూ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని, అభివృద్ధిపై చర్చిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగిందని ప్రజలు చెప్పారని, వారి ఆదరణ చూస్తే వచ్చే ఎన్నికల్లో పార్టీకి పూర్వ రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు రవీందర్‌సాగర్, మైనార్టీసెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఖలీమొద్దీన్, జిల్లా సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ నర్సింహులు, రాములు, శేఖర్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శులు సంజీవరెడ్డి, గోపాల్, బీసీసెల్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు నగేష్ పట్లూర్ ఎంపీటీసీ మంజుల, రావులపల్లి సర్పంచ్ దేవమ్మ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జాగ్రత్తగా గమ్యం చేరాలి

ధారూరు: రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండేలా ముందు జాగ్రత్తగా రోడ్డు మలుపులో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బి అధికారులకు సర్కిల్ సీఐ అప్పయ్య సూచించారు. హైదరాబాద్–తాండూర్ ప్రధాన మార్గంలో శనివారం ధారూరు–కేరెళ్లి గ్రామాల మధ్య రోడ్డు మలుపుల్లో పోలీసులు.. ఆర్అండ్‌బి సిబ్బంది ద్వారా సూచిక బోర్డులను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మలుపు రోడ్ల వద్ద పెరిగిన చెట్లు, పిచ్చి మొక్కలను తొలగించి.. ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనబడేలా చేశామని, సూచిక పలకలు డ్రైవర్లను ముందస్తుగా అప్రమత్తం చేస్తాయని ఆయన వెల్లడించారు. వాహనదారులు కూడా ట్రాఫిక్ నిబంధనలు, మూలమలుపుల వద్ద ముందు జాగ్రత్తలు పాటిస్తూ గమ్యానికి చేరుకోవాలని సూచించారు. సూచిక బోర్డుల ఏర్పాటులో ఎస్‌ఐ నరేందర్, సిబ్బంది ఉన్నారు.



ఒంటిమామిడి చెట్టు రోడ్డు మలుపులో సూచికబోర్డు ఏర్పాటు చేయిస్తున్న పోలీసులు